ప్రభుత్వ బడుల్లో తగ్గుతున్న విద్యార్థులు

- గతేడాది కంటే సుమారు 12 వేల మంది తగ్గుదల
- నియోజకవర్గంలో ఉన్నత పాఠశాలలు 28, ప్రాథమిక పాఠశాలలు 156
- విద్యాభివృద్ధిని పట్టించుకోని కూటమి ప్రభుత్వం



అన్నవరప్పాడులో మూతపడిన పాఠశాల



పెరవలిలో ముగ్గురు పిల్లలకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు



వెంకట్రాయపురంలో ముగ్గురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పెరవలి: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకూ తగ్గుతోంది. పెద్ద సంఖ్యలో చిన్నారులు సర్కారు పాఠశాలలకు బారులుతీరుతున్నారంటూ కూటమి పెద్దలు ప్రకటనలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకోవడం లేదు. ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నా విద్యాశాఖ ఏమాత్రం పట్టించుకోకుండా నిధులు కేటాయిస్తున్నాం, ఉపాధ్యాయులను భర్తీ చేస్తున్నామంటూ ప్రకటనలు చేయడానికే పరిమితమైంది. దీని ఫలితంగా అనేక పాఠశాలల్లో ఐదుగురులోపు ఉన్న విద్యార్థులు ఉన్న పాఠశాలల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉన్న కొద్ది మంది పిల్లలకు పాఠాలు చెబుతూ పాఠశాలలను నిర్వహిస్తున్నారు.

నిడదవోలు నియోజకవర్గంలోని పాఠశాలలు

నిడదవోలు నియోజకవర్గంలో 28 ఉన్నత పాఠశాలలు, 156 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులు సుమారు 23 వేలు మంది ఉన్నారు. వీరిలో ఉన్నత పాఠశాలలో చదువుకునే వారు 12,500 మంది. పెరవలి మండలంలోని 48 పాఠశాలల్లో 7 ఉన్నత పాఠశాలలున్నాయి. ఉన్నత పాఠశాలల్లో 1,949 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 41 ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 715 మంది చదువుతున్నారు. ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు 26 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో కేవలం 15 మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు.

ఐదుగురు విద్యార్థులున్న పాఠశాలల సంఖ్య 10

పెరవలి మండలంలో 41 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో కేవలం ఐదుగురిలోపు విద్యార్థులున్న పాఠశాలలు 10 ఉన్నాయి. అవి పెరవలి, మల్లేశ్వరం, ముక్కామల, కె అగ్రహారం, పిట్టలవేమవరం, ఉసులుమర్రు, కాపవరం, ముత్యాలవారిపాలెం, శీతారామపురం, వెంకట్రాయపురం. 5 నుంచి 10 లోపు విద్యార్థులున్న పాఠశాలలు 13 ఉన్నాయి. అవి నడుపల్లి కోట, కానూరు, మల్లేశ్వరం, ముక్కామల, నడుపల్లి, కాపవరం, నడుపల్లికోట-2, కడింపాడు, గవర్లపాలెం, కొత్తపల్లి అగ్రహారం, నల్లాకులవారిపాలెం, ఉమ్మిడివారిపాలెం, ఉసులుమర్రు గ్రామాలున్నాయి.

తగ్గిపోయిన విద్యార్థుల సంఖ్య

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతూనే ఉంది. గతేడాది నిడదవోలు నియోజకవర్గం పరిధిలో 38 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించగా ఈ ఏడాది ఆ సంఖ్య 23 వేలకు పడిపోయింది. సుమారు 15 వేలమంది ప్రభుత్వ పాఠశాలలను వదిలేశారు. ఇందులో సుమారు 3 మంది పదో తరగతి పూర్తయిన వారున్నారు. విద్యారంగాభివృద్ధిపై పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ఈ గణాంకాలే చెబుతున్నాయి. విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిపోయిందో తెలుసుకోవటం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కళకళలాడిన పాఠశాలలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడేవి. డిజిటల్ విద్యావ్యవస్థను తీసుకురావడంతో పాటు విద్యార్థులకు అందించే మెనూ వరకు అన్ని మార్పులు చేసారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. గత ప్రభుత్వం హయాంలో సర్కారు పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య పెరిగిందే తప్ప ఎక్కడా తగ్గలేదు. కూటమి పాలనలో ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉందని పలువురు విద్యా రంగ నిపుణులు అంటున్నారు.


ప్రభుత్వం శ్రద్ధ చూపాలి



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. ప్రభుత్వాలు పాఠశాలల బలోపేతం కోసం ప్రణాళికలు రూపొందించి కార్యాచరణ చేపట్టకుంటే వాటి మనుగడ ఉండదు. ప్రభుత్వం శ్రద్ధ చూపకుంటే పేద కుటుంబాల్లోని పిల్లలకు విద్య దూరమై సాంఘిక అసమానతలకు దారితీస్తుంది.

– బొకే వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు, ఖండవల్లి

క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాం



పాఠశాలలు తెరవక ముందు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచాం, అయినా పిల్లలు రాలేదు. పాఠశాలలు తెరిచిన తరువాత తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి అందిస్తున్న పథకాలు, సౌకర్యాలు వివరించినా ఫలితం లేకుండా పోయింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాం.

– బి.స్వరూప్, మండల విద్యాశాఖాధికారి, పెరవలి

సచివాలయాల వద్ద ప్రత్యేక వైద్యశిబిరాలు



వేగేశ్వరపురంలో వైద్య శిబిరం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: జ్వరాల వ్యాప్తిపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వేగేశ్వరపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు.

124 మందికి వైద్యసేవలు

ఉండ్రాజవరం(నిడదవోలు రూరల్): గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం ప్రేమ సువార్త సంఘంలో ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. తణుకు సన్ హాస్పిటల్ వైద్యురాలు శోభాచరణ్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారని అధ్యక్షుడు షోరోన్‌రాజు, ఉపాధ్యక్షుడు టి.అబ్బులు తెలిపారు.

హుకుంపేట పీహెచ్‌సీలో తనిఖీ

గోపాలపురం: హుకుంపేట పీహెచ్‌సీని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారని ఫిర్యాదు అందడంతో తనిఖీ చేపట్టినట్లు ఆయన తెలిపారు. వైద్యులు సుధీర్‌బాబు, జాన్సన్, దుర్గాభవాని సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించడం చంద్రబాబు నైజం



చాగల్లు సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: అబద్ధాలే పెట్టుబడిగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు విమర్శించారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెల్లివలస, కుమిలి, బత్తివలస, చాగల్లులో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశమై కూటమి ప్రభుత్వం మోసాలను వివరించారు. చంద్రబాబు పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను వివరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ పాలన

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో సీఎంగా జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారని వివరించారు. ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చిన అనంతరం విస్మరించడం చంద్రబాబు నైజమని మండిపడ్డారు. అధికారం కోసం టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టారని విమర్శించారు. అమరావతి, పోలవరం పేరిట కూటమి నాయకులు ప్రజలను మోసం చేస్తూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కంఠమణి రమేష్ బాబు, రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి పరిమి సోమరాజు, కొవ్వూరు టౌన్ అధ్యక్షులు చిట్టూరి అన్నవరం, బొర్ర రజిని తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వనిత పరామర్శ



గోపాలపురంలో ఎస్‌కే వలీని పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే బాలరాజు

గోపాలపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్‌కే ఖాదర్‌వలీ భార్య అత్తర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. వలీ కుటుంబ సభ్యులను మాజీ హోం మంత్రి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తానేటి వనిత, పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బుధవారం పరామర్శించారు. అనంతరం వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు పొండ్రి మురళి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మంత్రి వనిత వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్న బూరెడ్డి సత్యనారాయణ తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో అతనిని పరామర్శించారు. వీరి వెంట ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పడమట సత్యనారాయణ, వింత ప్రసాద్‌రెడ్డి, జంగా కృష్ణారెడ్డి, దేవరపల్లి, ద్వారకాతిరుమల మండల వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పంటకు తగు మోతాదులో ఎరువులు వాడాలి

దేవరపల్లి: పంటలకు తగు మోతాదులో ఎరువులు వాడాలని, దీని ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను ప్రజలకు అందించాలని వ్యవసాయశాఖ కొవ్వూరు సహాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. బందపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అధిక మోతాదులో ఎరువులు వాడడం వల్ల నేల సారం కోల్పోతుందని, నేలలో ఉండే సేంద్రియ కర్బనం క్రమంగా తగ్గిపోవడం వల్ల నేల సారం కోల్పోయి పంటలు పండవని ఆయన తెలిపారు. ద్రవ రూపంలో ఉండే నానో యూరియాను, జీవన ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి కె. కమల్‌రాజ్, సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ, ఏఈఓ సీహెచ్ సంజన, ఉద్యానవన శాఖ, వెటర్నరీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించవద్దు

పెరవలి: రొయ్యల ఫ్యాక్టరీ యజమానులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. పెరవలి మండలం అన్నవరప్పాడులో ఉన్న రొయ్యల ఫ్యాక్టరీ వలన పంట పొలాలు పాడైపోతున్నాయని రైతులు అందించిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పంట పొలాల్లోకి మురుగునీరు వస్తోందని, దీని వలన పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోయారు. మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి తెలపడంతోపాటు దెబ్బతిన్న పంట పొలాల పరిశీలనకు వ్యవసాయ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఆర్ డబ్ల్యూఎస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖాధికారులతో కలసి విచారణ చేస్తున్నామని తెలిపారు. అధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విచారణ కొనసాగుతుండగా తహసీల్దార్ ఫీల్డ్ విజిట్ చేస్తారని, అంతవరకు ఆర్ఐ, వీఆర్వోలు నిత్యం పరిశీలిస్తారని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె నిరంజన్, ఆర్ఐ పావని, రెవెన్యూ అధికారులు, పోలీసులు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భాద్రపద శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవారిని పెళ్లి కుమారుడిగా, శ్రీదేవి బూదేవి అమ్మవార్లను పెళ్లి కుమార్తెగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఈ వేడుకలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గా ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణం నిర్వహించారు.

అంగన్‌వాడీ విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలిగా అనంతలక్ష్మి



చాపర్ల అనంతలక్ష్మి

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ విభాగం గోపాలపురం నియోజకవర్గం అధ్యక్షురాలిగా గోపాలపురం మండలానికి చెందిన చాపర్ల అనంతలక్ష్మిని నియమించారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాల్, మాజీ హోం మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనితకు అనంతలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

లాక్ సూపరింటెండెంట్ల సమావేశం



ముప్పిడి విజయ్‌కుమార్

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం గ్రామానికి చెందిన జలవనరుల శాఖ వెస్ట్రన్ డివిజన్ లాక్ సూపరింటెండెంట్ ముప్పిడి విజయ్‌కుమార్‌ను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధవళేశ్వరంలో నిర్వహించిన లాక్ సూపరింటెండెంట్ల సమావేశం నిర్వహించి పలు డివిజన్లకు సంబంధించి అసోసియేషన్ కమిటీలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బుధవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను జలవనరుల శాఖ ఉద్యోగులు, లాక్ సూపరింటెండెంట్లు, లస్కర్లు అభినందించారు.

తలారి పరామర్శ



మునికాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

చాగల్లు: బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, దారవరంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కన్వీనర్ తలారి వెంకట్రావు పర్యటించారు. బ్రాహ్మగూడెంలో మాజీ సర్పంచ్ గారపాటి శివరామకృష్ణ తల్లి గారపాటి మునికాంతమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దారవరంలో సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ నాయనమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ మట్టావీరస్వామి, మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య, సర్పంచ్ కృప రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనాలు



గోపాలపురం లక్ష్మీదుర్గా టాక్సీస్టాండ్ వద్ద 41 కేజీల లడ్డూను దక్కించుకున్న వైఎస్ ఆర్మీ యూత్ సభ్యులు



నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



వాకతిప్పలో గణపతి మందిరం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గోపాలపురం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను బుధవారం ఘనంగా నిర్వహించి నిమజ్జనాలు చేశారు. 9రోజులుగా పూజలు అందుకున్న గణేశ్ విగ్రహాలను గ్రామంలో డప్పువాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని వాదాలకుంట, వెదుళ్లకుంట, చిట్యాల, పెద్దాపురం, దొండపూడిలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను ఊరేగించి సమీప చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు ఎప్పటికప్పుడు విగ్రహాల ఊరేగింపును పరిశీలిస్తున్నట్లు ఎస్సై పి.మనోహర్ తెలిపారు.

గణపతి లడ్డూ ప్రసాదానికి వేలం

గోపాలపురం: గోపాలపురం లక్ష్మీ దుర్గా టాక్సీ స్టాండ్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన 41 కేజీల లడ్డూ ప్రసాదానికి మంగళవారం రాత్రి నిర్వహించిన వేలంలో రూ.42,500 పలికింది. గోపాలపురం వైఎస్ ఆర్మీ యూత్ సభ్యులు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఆలయం వద్ద నిర్వహించనున్న అన్నసమారాధనలో ప్రసాదాన్ని పంపిణీ చేస్తామని వారు తెలిపారు.

పూజా గణపయ్యకు ప్రత్యేక పూజలు

నిడదవోలు: స్థానిక గణేష్ చౌక్ సెంటర్లోని పూజా గణపతి, కుమారస్వామి ఆలయం వద్ద 8వ రోజు బుధవారం గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన సత్య హరిచంద్ర నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస నాయుడిని ప్రత్యేక కిరీటం, దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. 103వ వార్షికోత్సవాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం అభినందనీయమని శ్రీనివాస నాయుడు కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, దాకే అనిల్ కుమార్, పగడాల రవి కిరణ్, నాగేంద్ర, పాలాకిరణ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో అన్నసమారాధనలు

నిడదవోలు రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం, తాడిమళ్లలో బుధవారం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. కోరుమామిడిలో వరసిద్ధి వినాయకుడికి పూజా కార్యక్రమాలు, అనంతరం గ్రామోత్సవం నిర్వహించి స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

గణేశ్ మండపం వద్ద దీపోత్సవం

కొత్తపల్లి: గణపతి నవరాత్రి భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొమరగిరి, మూలపేట, కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డిలో ఏర్పాటుచేసిన గణపతి మందిరంలో వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాకతిప్పలో గణపతి మందిరం వద్ద బుధవారం భక్తులు వివిధ ఆకృతులలో దీపాలు వెలిగించారు. మండలంలో ఆలయ కమిటీలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గరిక పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

మానవత సేవా సంస్థకు విరాళం



మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు విరాళం అందజేస్తున్న దాతలు

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు మండలంలోని యర్నగూడెంకు చెందిన మాజీ ఎంపీపీ గద్దే వెంకటరామారావు సోదరులు రూ. లక్ష విరాళం అందజేశారు. విరాళాన్ని సంస్థ మండల శాఖ ప్రతినిధులు బండి సూర్య ప్రకాశరావు, బళ్ల సూర్యచక్రం, కేశిరాజు రాజ్‌కుమార్‌కు గద్దే వెంకటరామారావు, గద్దే గోపాలకృష్ణ, గద్దే సత్యనారాయణ, గద్దే రాజేంద్రప్రసాద్ సమక్షంలో అందజేశారు. సంస్థ ప్రతినిధులు దాతలను అభినందించారు.

ఆలయ పాలక మండలిలో అవకాశమివ్వండి

పిఠాపురం: పిఠాపురంలో ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానం పాలక మండలి కమిటీలో ఫౌండర్స్ సేవా ట్రస్ట్ సభ్యులకు చోటు కల్పించాలని శ్రీపాద శ్రీ వల్లభ ఫౌండర్ సేవా ట్రస్ట్ సభ్యులు డిమాండ్ చేశారు. ఫౌండర్స్ సేవా ట్రస్ట్ సభ్యులు పిఠాపురంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పూర్వీకుల ఆశయాలు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి కృషి చేసేందుకే ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ కమిటీలో వైశ్యులకు స్థానం కల్పిస్తామని ఎన్నికల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, నేడు వేరే వారి పేర్లు తెరమీదకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 2న ట్రస్ట్ రిజిస్ట్రేషన్ చేయించామని త్వరలో పవన్ కల్యాణ్‌ను కలుస్తామని వారన్నారు. సమావేశంలో సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పైండా శ్రీరామ్ మూర్తి, కార్య నిర్వాహక అధ్యక్షుడు కుసుమంచి కామేశ్వరరావు, సెక్రటరీ పైండా సత్య రామన్న, ట్రెజరర్ కప్పల భాగ్యలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్‌కు నిధుల మంజూరు

తాళ్లపూడి: పైడిమెట్ట ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌కు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోలుకు కలెక్టర్ ప్రశాంతి రూ.9.75 లక్షలు మంజూరు చేసారని అధ్యక్షుడు ముళ్లపూడి రామచంద్రం తెలిపారు. ఎత్తిపోతల పథకం ఇబ్బందుల్లో ఉన్న సమయంలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరో పెద్ద సమస్య ఎదురైంది. ఎమ్మెల్యే మెప్పిడి వెంకటేశ్వరరావుకు, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో ఈ నిధులు మంజూరయ్యాయి.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: కృష్ణంపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధుల ఆశ్రమానికి దాతలు ఆర్థిక సాయం అందజేశారు. 15 ఏళ్లుగా ఆశ్రమ వ్యవస్థాపకులు జి. శ్యామలాదేవి గ్రామంలో వృద్ధాశ్రమం నిర్వహిస్తూ ఆదరణ కరువైన వారికి ఆశ్రయం కల్పిస్తున్నారు. యాదవోలుకు చెందిన అనిశెట్టి ప్రసన్నకుమార్ ఆశ్రమంలోని వృద్ధులకు మంగళవారం రాత్రి భోజన ఏర్పాటు చేసి ఆశ్రమ నిర్వహణకు రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని నిర్వాహకురాలు శ్యామలాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి గంగరాజు, చిలక సత్యనారాయణ, తుమ్మల వెంకట్రావు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి

ఉండ్రాజవరం (నిడదవోలు రూరల్): నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం వెలుగు కార్యాలయంలో అక్షర ఆంధ్రా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 9 వేల మంది నిరక్షరాస్యులను గుర్తించి తొలి విడతతో 2,200 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 220 మంది వలంటీర్లను నియమించామన్నారు. ఎంపీడీఓ వెంకటరామారావు, ఏపీఎం టి.బాలకోటయ్య, ఎంఈఓ శారదా జ్యోత్స్న, రిసోర్స్‌పర్సన్ ఎల్ఎన్ వీబీఆర్ఎల్ మూర్తి పాల్గొన్నారు.

నిమజ్జన ఊరేగింపులో అశ్లీల నృత్యాలు



తెలికిచెర్లలో అశ్లీల నృత్యం చేస్తున్న డ్యాన్సర్

నల్లజర్ల: తెలికిచెర్లలో వినాయక నిమజ్జనోత్సవ ఊరేగింపులో అశ్లీల నృత్యా లు ప్రదర్శించిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలికిచెర్ల, కమతంగుంట గ్రామాల్లో ఏడు చోట్ల వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించారు. ఐదవరోజు ఆదివారం నిమజ్జనం కార్యక్రమంలో కొత్తపేట వరసిద్ధి వినాయక మండపానికి సంబంధించి, వాకాల వారి వీధిలోని మండపానికి సంబంధించి ఊరేగింపులో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కొంతమంది మహిళా డ్యాన్సర్ల తో అశ్లీల నృత్యాలు నిర్వహించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఊరేగింపు ముగిసిందని పోలీసులను పక్కదారి పట్టించి రాత్రి 11 గంటల తర్వాత అశ్లీల నృత్యాలు నిర్వహించారు. దీనిపై నల్లజర్ల సీఐ బాలశౌరిని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.